సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తగరపువలస: ఆనందపురం మండలం 33/11 కేవీ వెల్లంకి సబ్‌స్టేషన్, 11 కేవీ గంభీరం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా బొడ్డపాలెం జగనన్న కాలనీ, బొడ్డపాలెం ఇండస్ట్రియల్ ఏరియా, బొడ్డపాలెం విలేజ్, గంభీరం ఇండస్ట్రియల్ ఏరియా, వెల్లంకి, గారిపేట, రెల్లిపేట, మన్యాలపేట, అప్పన్న కాలనీ, ఈగలవానిపాలెం, పాలవలస, మెట్టమీదపాలెం, గుడిలోవ తదితర ప్రాంతాల గృహ, పారిశ్రామిక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బస్ పాస్‌ల జారీకి రెండు రోజుల అంతరాయం

మధురవాడ: ఏపీఎస్‌ఆర్‌టీసీ మధురవాడ డిపోలో కంప్యూటర్లకు కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్న కారణంగా రెండు రోజులు కొత్త బస్‌పాస్‌ల జారీకి అంతరాయం ఏర్పడుతుందని డిపో మేనేజర్ రాజు ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పనులు గురు, శుక్రవారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి యథావిధిగా అన్ని కార్యకలాపాలు సాగుతాయని అంతా గమనించి, సహకరించాలని కోరారు.

నేడు తునిపాలంలో ముత్యాలమ్మ ఉత్సవం

పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలంలో గురువారం ముత్యాలమ్మ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగిస్తారన్నారు. ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, ఎండాడలో ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు పనులను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. 1.9 కి.మీ పొడవునా ఇంటర్‌కనెక్టింగ్ రోడ్డును 60 అడుగులకు విస్తరించడానికి రూ.7 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

25 మద్యం సీసాలు స్వాధీనం



తాతనాయుడు నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పద్మనాభం: మండలంలోని చిన్నాపురం జంక్షన్‌లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ జె.సురేష్ తెలిపారు. ఉల్లి సురేష్ కుమార్ నుంచి ఏడు మద్యం సీసాలను, జంకల తాతినాయుడు నుంచి 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అప్పన్న గోశాలలో ఏరువాక పున్నమి



శ్రీకృష్ణాపురంలోని గోశాలలో దుక్కి దున్నుతున్న దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం: ఏరువాక పున్నమి(జ్యేష్ఠ పౌర్ణమి)ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో వ్యవసాయ పనుల్లో భాగంగా బుధవారం భూమి పూజ నిర్వహించారు. నాగలికి, ఎద్దులకు పసుపు కుంకుమలు సమర్పించి, అనంతరం వాటి సాయంతో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు నేలను దున్నారు. గోశాలలో పలు పంటలు పండించేందుకు, పూలమొక్కలు పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ప్రతి రైతు ఏరువాక పున్నమి ఎంతో విశేషమైన రోజుగా భావిస్తారన్నారు. వ్యవసాయ పనులు ఏరువాక పున్నమి రోజునే ప్రారంభించడం సంప్రదాయంగా వస్తోందన్నారు. వేదకాలం నుంచి జ్యేష్ఠ పౌర్ణమిని ఏరువాక పున్నమిగా పిలవడం పరిపాటిగా మారిందన్నారు. గోశాల సీనియర్ అసిస్టెంట్ మూల వాసు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ ఎప్పుడో?



భీమిలి మెయిన్ రోడ్డులో సమస్య తీవ్రం • **ఇరుకు రోడ్డులో నిలిచిపోతున్న ట్రాఫిక్** • **కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు** • **నిత్యం నరకం చూస్తున్న ప్రజలు**



విస్తరణ చేయవలసి ఉన్న బీచ్‌రోడ్డు

భీమునిపట్నం: భీమిలి మెయిన్ రోడ్డుతో పాటు మరో రెండు రోడ్ల విస్తరణ కార్యరూపం దాల్చడం లేదు. దీంతో ఇరుకు రోడ్లలో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.

మెయిన్ రోడ్డే ప్రధాన సమస్య

భీమిలి మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ వల్ల ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఇక్కడ పాత బస్టాండ్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు ఉన్న రోడ్డులోనే పెద్ద ఇబ్బంది ఉంది. అసలే ఈ రోడ్డు వెడల్పు తక్కువ. అందులో పాత బస్టాండ్ నుంచి గంటస్తంభం వరకు రోడ్డు కొంత ఫర్వాలేదు, కానీ రెండు వైపులా షాపులు, వాటి ముందు చిరు వ్యాపారాల వల్ల రోడ్డు వెడల్పు బాగా తగ్గిపోయింది. ఇక గంటస్తంభం నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు రోడ్డు వెడల్పు బాగా తక్కువ. అందులో మరీ ముఖ్యంగా శివాలయం వరకు రెండువైపులా షాపులు ఉండడం, వాటి ముందు ద్విచక్రవాహనాలు నిలపడంతో రోడ్డు బాగా చిన్నదైపోయింది. ఇక్కడ ద్విచక్రవాహనాలు, ఆటోలు తిరగడానికే చాలా కష్టంగా ఉంటుంది. కాని ఇదే మార్గంలో విశాఖ, భీమిలి బీచ్‌రోడ్డు బస్సులు, స్కూల్ బస్సులు, ఇతర పెద్ద వాహనాలు తిరుగుతుంటాయి. అవి వచ్చినప్పుడు నిత్యం అవస్థలే. అవి సరిగ్గా వెళ్లలేక ఆగుతుండడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోతోంది. ప్రతిరోజు అనేక సార్లు ఇదే పరిస్థితి ఏర్పడుతుండడంతో ప్రయాణం నరకప్రాయంగా ఉంటోంది.

బీచ్‌రోడ్డు, బ్యాంక్ రోడ్డు కూడా..

మెయిన్ రోడ్డుతో పాటు బీచ్‌రోడ్డు, నర్సింహస్వామి ఆలయానికి వెళ్లే బ్యాంక్‌రోడ్డులో కూడా సమస్యలు ఉన్నాయి. ఇక్కడ బీచ్‌రోడ్డులోని బోయివీధి వద్ద, బ్యాంక్‌రోడ్డులోని నర్సింహస్వామి ఆలయానికి వెళ్లే చోట ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోనూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతూ ఉంటాయి.

ప్రకటనలు, పరిశీలనలకే పరిమితం

ఇక్కడ ప్రధాన సమస్య అయిన మెయిన్‌రోడ్డు విస్తరణ చేపడతామని అధికారులు, ప్రజా ప్రతినిధులు 20 సంవత్సరాలుగా ప్రకటనలు చేస్తున్నారు. 60 నుంచి 80 అడుగుల మధ్య విస్తరణ ఉంటుందని, దానికి అనుగుణంగా అంచనాలు, కొలతలు వేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా షాపులు, ఇతర నిర్మాణాలు తొలగిస్తే ఏ మేరకు నష్టపరిహారం ఇవ్వాలనే దానిపై కూడా చర్చలు, సమావేశాలు నిర్వహించారు, ఇప్పటికీ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గత సంవత్సరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మెయిన్ రోడ్డు విస్తరణ గురించి పరిశీలన చేయడంతో పాటు అధికారులతో సమావేశం కూడా నిర్వహించి, త్వరలో పనులు జరుగుతాయని వెల్లడించారు. కానీ, దీనిపై ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో సంవత్సరాలైతే గడిచిపోతున్నాయి.. తప్ప పరిస్థితి అలాగే ఉండిపోతోంది. మరో వైపు ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతుండడంతో రాకపోకల కష్టాలు అంతకంతకూ జటిలమవుతున్నాయి.



పాత బస్టాండ్ నుంచి గంటస్తంభం వరకు ఉన్న మెయిన్ రోడ్డుకు ఇరువైపులా షాపులు, చేపల విక్రయాలు



గంటస్తంభం నుంచి షాపుల వల్ల మరింత కుదించుకుపోయిన రోడ్డులో నిలిచిపోతున్న ట్రాఫిక్

రోజూ నరకం చూస్తున్నాం



ఇక్కడ మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతుండడంతో రోజూ అందరం చాలా ఇబ్బంది పడుతున్నాం. వాహనాల రాకపోకలకే కాదు, కనీసం నడిచి వెళ్లడానికి కూడా కష్టమవుతోంది. నిత్యం నరకం చూస్తున్నాం.

–తాడివాడ లక్ష్మణ కుమార్, భీమిలి

పరిశీలిస్తున్నారు.. వెళ్తున్నారు



అనేక ప్రాంతాల్లో రోడ్ల విస్తరణలు జరుగుతున్నా ఎంతో అవసరమైన ఇక్కడి మెయిన్‌రోడ్డును మాత్రం పట్టించుకోవడం లేదు. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ ఎటువంటి చర్యలూ ఉండటం లేదు. అయితే సంవత్సరాల తరబడి పరిశీలనలకే ఇది పరిమితమైపోయింది.

–రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, భీమిలి

ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి



ట్రాఫిక్ సమస్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో మరింత కష్టమవుతోంది. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టాలి. మా ప్రధాన సమస్యను పరిష్కరించాలి.

–చందక చంద్రశేఖర్, భీమిలి

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ప్రాంతాలను వ్యర్థ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి కోరారు. గొల్లల ఎండాడలో బుధవారం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ విశాఖ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ డంప్ చేయకూడదని ప్రజలకు సూచించారు. పాలిథిన్ నిర్మూలన బాధ్యతను ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్‌కు ఎండాడలో భూమి కేటాయింపు



ఫైర్ స్టేషన్‌కు కేటాయించిన భూమిలో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మధురవాడ: అగ్నిమాపక కేంద్రం నిర్మాణం కోసం ఎండాడ రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు 179లో 50 సెంట్ల స్థలాన్ని అధికారులు కేటాయించారు. ఆ స్థలంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది బుధవారం సర్వే చేపట్టారు. హైవే, దిశ పోలీస్ స్టేషన్‌ను ఆనుకుని ఈ స్థలాన్ని కేటాయించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండల సర్వేయర్ ప్రసాద్, రమణ, బంగార్రాజు, జియోకాన్ సర్వేయర్ నాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమస్యల స్వాగతం

- అసౌకర్యాల నడుమ తెరుచుకోనున్న బడులు
- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం



చేతులు శుభ్రం చేసుకునేందుకు సిద్ధం కాని కుళాయిలు



జీవీఎంసీ ఒకటోవార్డు బాలాజీనగర్‌లో పూర్తి కాని నాడు-నేడు పనులు



నాడు-నేడు పనులు పూర్తి కాని టి.నగరపాలెం ప్రాథమిక పాఠశాల

తగరపువలస: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులకు పాఠశాలల్లో వసతుల సమస్యలు స్వాగతం పలకనున్నాయి. ఈ ఏడాది ముందస్తుగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టలేదు. ఇప్పటికే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు గల్లీగల్లీకి తిరిగి చిన్నారులకు తమ విద్యాసంస్థలలో ప్రవేశాలు కల్పించాయి. మరో పక్క 'నాడు-నేడు' రెండో విడత పనులు కూటమి ప్రభుత్వం హయాంలో చాలా పాఠశాలల్లో పూర్తి కాలేదు. అలాగే గత విద్యా సంవత్సరంలో కూడా పట్టుమని పది మంది విద్యార్థులు లేని ప్రభుత్వ పాఠశాలలు భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పదుల సంఖ్యలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో పేర్కొన్న ప్రకారం తల్లికి వందనం ఇవ్వాలని తల్లి దండ్రులు కోరుతున్నారు.

రోడ్డు తవ్విన వారిపై కేసు నమోదు

- వివిధ విభాగాల నుంచి నోటీసులు జారీ
- పొక్లెయిన్ సీజ్

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డు తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ముబారక్ కాలనీలో అనధికారికంగా బీటీ రోడ్డు తవ్వడంపై జోన్–2 జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముబారక్ కాలనీ వద్ద మంగళవారం ఎటువంటి అనుమతులు లేకుండా భారీ స్థాయిలో రోడ్డును తవ్వేశారు. దీనివలన జీవీఎంసీ వాటర్ పైప్‌లైన్, అండర్‌గ్రౌండ్ విద్యుత్ వైర్లు ధ్వంసమయ్యాయి. 5 ప్రాంతాలకు రోజంతా రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై బుధవారం సాక్షి దినపత్రికలో 'రోడ్డును తవ్వేశారు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. రోడ్డును తవ్విన ప్రాంతాన్ని జీవీఎంసీ సిబ్బందితో కలసి పరిశీలించారు. వీరు చేసిన నిర్వాకం వలన స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆమె రోడ్డును తవ్విన వారిపై ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోడ్డు తవ్వడానికి ఉపయోగించిన పొక్లెయిన్‌ను సీజ్ చేయించారు. రోడ్డును, పైప్‌లైన్లు, విద్యుత్ వ్యవస్థ యథాస్థితికి వచ్చేలా బాధ్యత వహించాలని నిర్వాహకులకు తెలిపారు. రోడ్డును తవ్విన వారికి భారీ పెనాల్టీ విధిస్తామన్నారు. అదేవిధంగా విద్యుత్ శాఖ నుంచి, మంచినీటి శాఖ నుంచి, జీవీఎంసీ నుంచి నోటీసులు కూడా జారీ చేసినట్లు పేర్కొన్నారు.

బుధవారం కూడా నిలిచిన నీటి సరఫరా

ఇక్కడ పైప్‌లైన్ తవ్వేయడంతో ఎండాడ, గొల్లల ఎండాడ, రాజీవ్‌నగర్, సుభాష్‌నగర్, బీచ్ రోడ్డు ప్రాంతాలకు బుధవారం కూడా మంచినీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం మంచినీటి సరఫరా విభాగం కార్మికులు తమ సమస్యల పరిష్కార డిమాండ్ కోసం చేస్తున్న మహాధర్నాలో ఉండటంతో విధులకు ఎవరూ హాజరు కాలేదు. దీంతో స్థానికులు మంచి నీటి కోసం అవస్థలు పడుతున్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఎంపీపీ వాసురాజు
- భీమిలి మండల సమావేశంలో అధికారులకు ఆదేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

భీమునిపట్నం: భీమిలి మండలం పరిధి గ్రామాల్లో సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ దంతులూరి వాసురాజు అధికారులను సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ వాసురాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ తమ గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు త్వరగా అందించాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలన్నారు. పలు గ్రామాల్లో లో ఓల్టేజ్ సమస్యలు ఉన్నాయని, దీనివల్ల విద్యుత్ పరికరాలు పాడైపోతున్నాయని తెలిపారు. దీనిపై ఎంపీపీ వాసురాజు స్పందిస్తూ, సభ్యులు తెలిపినట్టు ఆయా ప్రాంతాల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా లోఓల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో తక్షణం సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను వెల్లడించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బోని బంగారునాయుడు, సురపతి దుర్గాలమ్మ, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, ఎంపీడీవో హనుమంతరావు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 24మంది ఎంపిక

ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఉచిత శిక్షణలో రాణించిన విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీకి చెందిన 24 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు సొసైటీ అధ్యక్షుడు గంటాన మోహనరావు తెలిపారు. ఆయన వివరాలు వెల్లడించారు. గత విద్యాసంవత్సరంలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఆరు నెలల పాటు సెలవుల సమయంలో వందలాది మంది 8వ తరగతి విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు, బాపట్ల జిల్లా చుండూరు చెందిన దేవరాపల్లి రాజారావు విద్యార్థులకు స్వచ్ఛందంగా శిక్షణ ఇచ్చారన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు స్టేషనరీ, అల్పాహారం అందించాయని తెలిపారు. అందరి సమిష్టి కృషి ఫలితంగా తమ విద్యార్థులకు జిల్లా స్థాయిలో 2, 28, 36వ ర్యాంకులు కూడా వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

తరగతుల విలీనం నిలిపివేయాలని వినతి



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్ జ్యోతి

పద్మనాభం: మండలంలోని ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులను పద్మనాభం మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేయకుండా నిలిపివేయాలని ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ హంస జ్యోతి, వైస్ చైర్మన్ ఎం.భారతి, సభ్యులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. నగరంలోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి, వినతి పత్రం సమర్పించారు. ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాలలో 50 ఏళ్ల నుంచి ఒకటి నుంచి ఐదు వరకు తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇటీవల పెట్టిన నిబంధనల వల్ల తమ పాఠశాలలోని మూడు నుంచి ఐదు తరగతులను పద్మనాభం మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేయడానికి విద్యాశాఖ అధికారులు నిర్ణయించారని పేర్కొన్నారు. దీనివల్ల విద్యార్థులు కిలో మీటరు దూరం నడిచి, రాష్ట్ర రహదారిని దాటి పద్మనాభం పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. రోడ్డుపై భారీ వాహనాలతో పాటు ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిరంతరం తిరగడం వల్ల చిన్నారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, ఇసకలపాలెంలోనే అన్ని తరగతులు నిర్వహించేలా చూడాలని కోరారు.

చంద్రంపాలెం ఉపాధ్యాయులకు పదోన్నతులు

ఇద్దరికి హైస్కూల్ హెచ్‌ఎం పోస్టులు

మధురవాడ: చంద్రంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఆరుగురు ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ వచ్చాయి. ఇందులో నలుగురు ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా, ఇద్దరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. ఇక్కడ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన అద్దంకి విజయకుమారి అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం జంపపాలెం హైస్కూల్ హెచ్‌ఎంగా నియమితులయ్యారు. మరో స్కూల్ అసిస్టెంట్ ఎస్‌వీఎస్ వరలక్ష్మి రోలుగుంట మండలం బుచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు. వీరితో పాటు కేవీ సూర్యనారాయణ, రామం, రమాదేవి, ఎం.అరుణ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. వీరికి ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

గోస్తని వంతెనపై శిథిలమైన నడకమార్గం



నడకమార్గం శిథిలమై గడ్డి మొలిచిన దృశ్యం

తగరపువలస: స్థానిక గోస్తని నదిపై నడక మార్గం శిథిలం కావడంతో తగరపువలస వైపు వెళ్లే పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. టి.నగరపాలెం మొదలుకుని శిథిలమైన నడక మార్గ భాగంలో గడ్డి కూడా మొలిచింది. ఈ ప్రాంతంలో మరమ్మతులు చేయించి సిమెంట్ పలకలు వేయడం ద్వారా పాదచారులు వెంకటేశ్వరమెట్ట వరకు ఆ మార్గంలో నడిచి వెళ్లడానికి అనువుగా ఉంటుంది. ప్రస్తుతం ఈ నడక మార్గం బాగా లేని కారణంగా జాతీయరహదారి మీదుగా నడచి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై జాతీయ రహదారుల సంస్థ ప్రతినిధులు స్పందించాలని, తమ నడక కష్టాలను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

డీ మార్ట్ రోడ్డులో ట్రాఫిక్ అవస్థలు



డీ మార్ట్ రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్



మధురవాడ బస్ స్టాప్-జోనల్ ఆఫీసు వద్ద నిలిచిపోయిన వాహనాలు

మధురవాడ: డీ మార్ట్ రోడ్డులో ట్రాఫిక్ తరచూ నిలిచిపోతోంది. ఇక్కడ వాహనాల రద్దీ అధికంగా ఉండడం, ఇరుకు ప్రాంతంలో డీ మార్ట్ ఉండడంతో పోలీసులు చేస్తున్న ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరుగానే మారుతోందని పలువురు అంటున్నారు. బుధవారం సాయంత్రం ఇదే జరిగింది. దీనికి ఇరువైపులా కిలో మీటరు పైనే ట్రాఫిక్ నిలిచిపోయి వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటు కార్‌షెడ్ నుంచి కొమ్మాది వరకు వాహనాలు నిలిచిపోయాయి.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

- కారులోంచి రోడ్డుపై ఎగిరిపడిన యువతి
- వెంటిలేటర్‌పై చికిత్స



బోల్తా పడ్డ కారు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు పెద రుషికొండ సమీపంలో కారు బోల్తా పడిన ఘటనలో యువతి గాయాలపాలైన సంఘటన చోటు చేసుకుంది. పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. మద్దిలపాలెం దరి పిఠాపురానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు భీమిలి నుండి నగరం వైపు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద రుషికొండ సమీపంలోకి వచ్చేసరికి ఓ కుక్క అడ్డుగా రావడంతో దానిని తప్పించబోయి ఆ కారు డివైడర్‌ను ఢీ కొట్టి, రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో నుంచి సాయిశ్రీ (20) రోడ్డుపైకి ఎగిరి పడింది. దీంతో యువతికి తీవ్ర రక్తస్రావమై, అపస్మారక స్థితిలోకి చేరుకుంది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు వెంటనే స్పందించి కారులో చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. వీరంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. యువతి ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నట్లు సీఐ తెలిపారు.